దాదాజీ

విమలారామం

సంధ్య రాగరంజిత మయింది.

గూళ్ళకి తిరిగిపోయే పక్షులు చిన్నపాట కచ్చేరీ పెడుతున్నాయి మెల్ల మెల్లగా కదలి వచ్చే పిల్లగాలి గిలిగింతలు పెడుతోంది

పిల్లలు కేరింతలు కొడుతున్నారు. యువ జంటలు పరిహాసాల చిరుహాసాల మురిపాలలో తేలియాడుతున్నారు.

వయసు మళ్ళిన వాళ్ళకి కొంచెం వయస్సు వెనక్కి మళ్ళించేటంత మనోహరంగా వుంది పార్కులోని వాతావరణం'

లక్ష్మీనారాయణగారు పార్కులోకి వచ్చి అప్పుడే అరగంటయింది అరగంట నుంచీ ఉండుండి ఆయన గేటు వైపు చూస్తూనే ఉన్నాడు.. రంజని వస్తుందేమోనని!

రంజని వచ్చే వేళ ఇంకా కాలేదు రంజని రోజూ ఒకే వేళకు వస్తుంది తను రంజని కంటె చాలా ముందు వచ్చి కూర్చున్నాడు ఆమె కోసం అలా యెదురు చూడటంలో ఆయనకేదో అవ్యక్తమయిన ఆనందం ఉంది!

రంజనితో పరిచయమయి ఆరు నెలలు అయిందేమో! అంతే ఎన్నో ఏళ్ళ నుంచి ఉన్న బంధాలన్నిటినీ మరిపించేటంత అనుబంధం ఆమెతో ఏర్పడిపోయింది

ఒక్కోసారి లక్ష్మీనారాయణ గారికి దేవుడెంత గమ్మత్తయిన పనులు చేస్తుంటాడు - అని అనిపిస్తూంటుంది! మనస్సు కెంతో దగ్గరయిన వాళ్ళను ఇట్టే దూరం చేస్తుంటాడు మనస్సులో పెట్టుకుని ఆదరించవల్సిన వాళ్ళు ఎంత దగ్గరగా వున్నా ఎంతో దూరమయి పోయినట్టు అనిపించేలా చేస్తుంటాడు. ఈ జీవితం యింక ఒంటరితనంతో కడతేరిపోతుందేమో - అని దిగులు పడుతున్న సమయంలో ఎక్కడి నుంచో ఎవర్నో తెచ్చి తన మనస్సులో పీఠం వేసుక్కూర్చోమంటుంటాడు' తనతో పరిహాస మాడటం ఆ భగవంతుడికి వేడుక యేమో!

లక్ష్మీనారాయణ గారు సర్వీసులో ఉండగా ఎప్పుడూ బిజీగా ఉండే వాడు ఆఫీసులో అనేకమందికి పనులు వెతుక్కోవటంతోనే సరిపోయేది - కాని, ఆయన కోసం పనులు ఎప్పుడూ సిద్ధంగా కూర్చునేవి. చాలా మందికి ఆఫీసుకి వచ్చింది లగాయితు గడియారాల వైపు చూస్తూ - ఎప్పుడు ఆఫీసు టైము అయిపోతుందా అని ఎదురు చూడ్డం తోటే గడిచిపోయేది. కాని, ఆయనకి మాత్రం - అంతా వెళ్ళిపోయాక ఆఫీసులో నిశ్శబ్దమైపోతే ' - 'అరే, అప్పుడే టయిమై పోయిందా' అని అనిపించేది.

ఆయన చాల క్రమశిక్షణలో పెరిగిన మనిషి. ఎవరు మారినా ఎవరు మారకపోయినా - తను మాత్రం తను నమ్మిన పంథా నుంచి ఒక్క మిల్లీ మీటరు పక్కకు జరిగి ఎరుగడు. ఆఫీసు వేళలో ఆఫీసుకే అంకితమయి పోవాలని తుచ తప్పకుండా నమ్మిన మనిషి - ఆచరించి చూపించిన మనిషి!

చెప్పాలంటే - చాలా మందితో పోలిస్తే - ఆఫీసు పనుల వత్తిడి వల్ల - తన స్వవిషయాలు చాలా వాటిని చాలా కాలం ఆయన వాయిదా వేసుకుంటూ వచ్చాడు.

ఆయనకి సాహిత్యాభిలాష మెండు ఇంట్లో బోల్డన్ని పుస్తకాలున్నాయి. ఎప్పుడో వావిళ్ళ వారు ప్రచురించిన పురాతన గ్రంథాలు మొదలుకొని ఇటీవల ఎమెస్కో వారు ప్రచురించిన ప్రబంధాల వరకూ ఆయన దగ్గర ఎన్నో పుస్తకాలు ఉన్నాయి. పాత పుస్తకాలు బాగు చేసి వాటిని స్వయంగా బైండు చేసాడు అది మంచి వయస్సులో ఉన్నప్పటి సంగతి ఆ రోజుల్లో సరదాయే కాకుండ చదవటానికి సమయమూ ఉండేది కాని, తర్వాత్తర్వాత పిల్లలు పెద్ద వాళ్ళవటంతో, ఆఫీసు బాధ్యతలు పెరగటంతో ఇక తీరలేదు అడపాతడపా కొనే పుస్తకాలకి కాగితం అట్టలు మాత్రం వేసి వుంచేవాడు .. కొంచెం ఈ బాధ్యతలు భారం తగ్గాక ఈ పుస్తకాలన్నిటినీ కేటలాగ్ చేసి ఇంట్లో చక్కని లైబ్రరీ ఒకటి తయారు చేయాలని ఆయన సంకల్పం ఆ తర్వాత ఒక్కొక్కటే తీసుకొని తీరిగ్గా చదువుకోవాలని కోరిక ఇది సర్వీసులో ఉండగా తీరదని త్వరలోనే ఆయనకి తెల్సిపోయింది రిటయిరయినాక తను చేద్దామనుకుంటూ వాయిదా వేసిన పనులలో ఇదొకటి!

తనకు కాశీ యాత్ర చేయాలని వుండేది. 'గంగలో స్నానం చేద్దామండీ' అనేది భార్య. 'కాశీయే కాదు ప్రయాగ యాత్ర చేద్దాం. త్రివేణీ సంగమంలో స్నానం చేద్దాం' అన్నాడు తను తిరుపతి రాజా కన్యాకుమారి వెళ్ళి అక్కడి సూర్యోదయ సౌందర్యాన్ని వర్ణించి చెప్పాక అది తప్పక చూడాలనిపించింది 'శంకరా భరణం' సినిమాలో మంజుభార్గవి నృత్యం చేసిన చోటు - బేలూరులో చెన్నకేశవస్వామి గుడిలోదని ఎవరో చెప్పారు. బేలూరు వెళ్ళి ఆ శిల్పకళను కనులారా విందు చేసుకోవాలనిపించింది. ఊటీ వెళ్ళి వచ్చిన శేషాచలం నీలగిరుల చక్కదనాన్ని రోజుల తరబడీ వర్ణించాడు. ఊటీకి వెళ్ళలేక పోయినా దగ్గరున్న అరకులోయకయినా తప్పకుండా వెళ్ళాలను కున్నాడు లక్ష్మీనారాయణగారు. ఈ యాత్రలు, విహారాలు ఆయనకు సర్వీసులో ఉండగా వీలుపడలేదు. ఆర్థికమయిన చిక్కులే కాదు, ఆఫీసు పనులు - ఇంటి పనులూ ఏవోటి ఆటంకం తెచ్చేవి. 'తర్వాత వెడదాం' అని అనుకునేవాడు. ఆ 'తరువాత' రిటయిరుమెంటు తేదీని కూడా దాటి వెళ్ళిపోయింది!

'ఇన్నాళ్ళుగా చేయలేకపోయిన పనులన్నీ చేపట్టాలి' అని అనుకుంటుండగా హఠాత్తుగా భార్య జబ్బు పడింది. భార్య వెంట లేకుండా ఆయన చుట్టాలింట్లో పెళ్ళి క్కూడా వెళ్ళి ఎరుగడు - అటువంటిది తీర్థయాత్రలు చేయటం కూడానా!

రిటయిరయి ఏడాది కావస్తోంది భార్య ఆరోగ్యం ఏమాత్రమూ బాగుపడలేదు యాత్రల మాట దేవుడెరుగు. కనీసం, ఇంట్లో లైబ్రరీ పెట్టుకుందా మనుకున్న పనికి శ్రీకారం చుట్టటం కూడ కాలేదు పట్టుమని పది పుస్తకాలు చదవటమూ జరగలేదు 'ఇంత కాలం కాయ శరీరంతో చకచకా యింట్లో తిరిగే మనిషి - ఒక్కసారిగా యిలా మంచాన పడిపోయిందేమిటి?' అని భార్య గురించి దిగులుతోనే ఆయనకి రోజులు వెళ్ళిపోయాయి

భార్య పరిస్థితి విషమించింది 'వద్దు శాంతా! నాకన్యాయం చేయకు' అని తను కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు 'ఈ అనారోగ్యంతో మిమ్మల్ని నిత్యం బాధ పెడుతున్నాను. నా వల్ల సుఖమేముంది?' అని తను బాధ పడింది 'అలాగనకు నీ వల్ల నాకెటు వంటి బాధా లేదు. నా కోసం నువ్వు బ్రతకాలి, ఉద్యోగంలో ఉండగా నిన్నెక్కడికీ తీసుకొని వెళ్ళలేకపోయాను కొన్ని కొన్ని పనులు వయసులో ఉండగానే చేయాలి వాటిని వాయిదా వేయటం వల్ల ఎంత నష్టం వస్తుందో నా కిప్పుడు తెలుస్తోంది నా కోసం నువ్వు ఆరోగ్యవంతురాలివి కావాలి మనం యిద్దరం కల్సి అన్ని వూళ్ళూ చూసివద్దాం పెద్దవాడి దగ్గర కొన్నాళ్ళుందాం మరికొన్నాళ్ళు చిన్నాడి దగ్గరకి వెడదాం అమ్మాయి కూడా తన దగ్గరకి రమ్మని ఎన్నో సార్లు చెప్పింది దాని కోరిక కూడా తీర్చాలి. ఆ తర్వాత కాశీ, కన్యాకుమారి, బేలూరు, ఇంత కాలంగా వెళ్ళాలనుకున్న చోట్ల కల్లా వెడదాం అన్ని చోట్లకు నిన్ను తీసుకువెళ్ళి తిప్పి తీసుకు వస్తాను ఇప్పుడు డబ్బు కిబ్బంది లేదు గ్రాట్యుయిటీ వచ్చింది మన బాధ్యతల బరువు పిల్లలమీద పెట్టనక్కర్లేదు' అని ఎంతో యిదిగా చెప్పాడు

భార్య తన కోరిక తీర్చాలనుకుంది తనతో కల్సి తీర్థయాత్రలు చేయాలనుకుంది. ఆమె బ్రతకటానికి కేవలం ఆమె 'విల్ పవర్' సరిపోలేదు తన కోసం దేవుడితో చాలా పోరాడింది. కాని, లాభం లేకపోయింది చివరకి దేవుడే గెలిచాడు 'మీ చేతుల్లో పసుపు కుంకుమలతో వెళ్ళి పోతున్నాను నా అంత అదృష్టవంతురాలు లేదు' అంటూ తనని దురదృష్టవంతుణ్ని చేసి వెళ్ళిపోయింది శాంత.

ప్రతి మనిషికి జీవితంలో ఎన్నో అనుబంధాలు ఏర్పడుతుంటాయి. కొన్ని అనుబంధాలు ప్రాణ సమానమయిపోతాయి. లక్ష్మీనారాయణ గారికి ఉద్యోగం రావటమూ పెళ్ళి జరగటమూ దాదాపు ఒకేసారి జరిగాయి. ఉద్యోగంలో కొత్త సంసారంలో కొత్త. కొత్తదయిన ప్రతి దాంట్లోనూ ఆకర్షణ వుంటుంది. ఆకర్షించిన చోట అనురాగం ఏర్పడితే అది విడదీయరాని అనుబంధంగా ఏర్పడుతుంది.

ఉద్యోగంలోని తృప్తి – భార్య అనురాగంలోని రక్తి, ఆయన మనస్సుని మురిపించాయి. మరపురాని అనుభూతుల్ని అంతర్లీనం చేసాయి

అటువంటి జీవితం ఒక్కసారిగా తారుమారయి పోయినట్టయింది ఉద్యోగం తోటి బంధమూ – భార్య తోటి రాగానుబంధమూ రెండూ స్వల్ప వ్యవధిలో తెగిపోయాయి. ఆయనకి జీవితంలో శూన్యం చోటు చేసుకుంది అబ్బ, జీవితంలో మనిషి ఇంత ఒంటరివాడయి పోయే క్షణాలుంటాయా! గతంలో ఎవరికయినా ఇలాంటి పరిస్థితి వస్తుందంటే ఆయన వూహకు కూడా అంది వుండేది కాదు అంత బిజీ లైఫ్ గడిపాడాయన ఇప్పుడో? స్వయంగా అనుబవిస్తున్నాడు భరించ లేనంత బాధగా వుంది!

తను ఒంటరితనం ఫీల్ అవుతున్నాడని తెల్సి చిన్నకొడుకు ఢిల్లీకి తీసుకు వెళ్ళి కొన్నాళ్ళు దగ్గర పెట్టుకున్నాడు చిన్నకోడలి హృదయం విశాల మయినదే – కాని, వాళ్ళుండే యిల్లు చాలా యిరుకయినది ఇద్దరు పిల్లలతో ఆ గదిన్నర జాగాలోను వాళ్ళే ఇబ్బందులు పడుతుంటే వాళ్ళెంత ఉండమంటున్నా తనెంత కాలం అక్కడుండగలడు? వెళ్ళిన నాల్గు నెలలలోనే 'అన్నయ్యనీ అక్కయ్యనీ చూసి మళ్ళీ వస్తానురా' అని చెప్పి తిరిగి వచ్చేసాడు

కూతురి ఆనందం కోసం తృప్తి కోసం ఆమె దగ్గర ఓ నెల్లాళ్ళు ఉన్నాడు అంతకుమించి అల్లుడి యింట్లో ఉండటం భావ్యమనిపించలేదు చివరకు పెద్దకొడుకు యింట్లో స్థిర నివాసం ఏర్పరచుకోవటం జరిగింది!

శాంతతో పెళ్ళయిన కొత్తలో ఉమ్మడి కుటుంబంలో ఉండేవారు కొంచెం నోరు విప్పి భార్యాభర్తలు మాట్లాడుకోటానికి సంకోచించ వల్సి వచ్చేది ఎవరు వింటారో – ఎవరు పరిహాసం చేస్తారో అని వెనకముందులు చూసుకోవటం తోటే ఆవేశాలు చప్పబడిపోయేవి అనుబవాలు అనుభూతుల వరకే పరిమితమయిపోయేవి

కొంచెం అన్నదమ్ముల నుంచి విడివడి తను సంసారం ప్రత్యేకంగా పెట్టుకున్నారనుకొనేసరికి తమ కన్నబిడ్డలే ఎదిగి వచ్చారు భార్యని ఒక్కసారి దగ్గరకు తీసుకోటానిక్కూడా దొంగతనం చేస్తున్నంతగా అటూ యిటూ చూడాల్సి వచ్చేది ఎప్పుడో 'పిల్ల పిశాచులు' నిద్రపోయాక కాని తమకి వీలు చిక్కేది కాదు అటువంటి ఏకాంతం తమకెప్పుడూ కొరవే అయింది

ఆ ఏకాంతం కోసమే తను రిటయిరయిన తర్వాత తన పెద్ద కొడుకు వచ్చి వుండమన్నా – భార్యను తీసుకొని వెళ్ళలేదు లక్ష్మీనారాయణగారు గతించిన జీవితంలోని మధురానుబూతుల్ని ఒక్కటొక్కటే గుర్తుకు తెచ్చుకొని పూలమాలలా గుచ్చుకోవటం మొదలు పెట్టారు ఆ మదుర పరిమళాలు ఆఘ్రాణించి ఆనందించటం ప్రారంభించి నాల్గు నెలలు కాలేదు భార్యకు జబ్బు చేసింది ఆ తర్వాత తను ఏకాంతాన్నే కాదు తన జీవితంలోని ఆశల్నీ, ఆశయాల్నీ అన్నిటినీ లాక్కుపోయి తనని ఏకాకిని చేసింది శాంత

రిటయిరయినప్పుడు కూడా తనకి పెద్ద వయస్సు వచ్చిందని నమ్మలేక పోయాడు బార్య చనిపోయ్యాక ఒక్క ఆరు నెలల్లో ఆరేళ్ళ వయస్సు మీద పడినంత నిస్సత్తువ, నీరసం ఆయన్ని ఆవరించాయి

పెద్దకొడుకు సూర్యం యింట్లో పైకి చెప్పు కునేటంత ఇబ్బందులేవీ లేవు తనకు కాని, భరించలేకపోతున్నది ఈ ఒంటరితనమే! అంతా దగ్గరగా వున్నా దూరంగా ఉన్నట్లే వుంటుంది

సూర్యం పెద్ద ఆఫీసరు అయినందుకు తనకు సంతోషంగానే వుంటుంది కాని, పెద్ద ఆఫీసరు అయినందుకు అతనికి పెద్ద పెద్ద కనెక్షన్సు ఉన్నాయి క్లబ్బుకి వెడతాడు పార్టీలకి వెడతాడు ఎక్కడో మీటింగులకి వెడతాడు రోజూ పొద్దు పోయి యింటికి వస్తాడు తన దగ్గర కూర్చుని కాసేపు పిచ్చాపాటీ వేసేంత తీరిక అతనికి లేదు!. ఏ ఆదివారమో కాసేపు కాఫీ తాగే వేళనో, భోజనం చేసే వేళనో పలకరిస్తే అదే ఒక బ్రహ్మాండం అయిపోతోంది!

తానాయింటికి వచ్చిన కొత్తలో మనుమడు నారాయణ బి కామ్ చదువుతూండేవాడు ఆ తర్వాత బాంకింగ్ పరీక్షలకి చదివేవాడు' ఎప్పుడూ ఏదోటి చదువుకొనే మనవడి దగ్గరకి వెళ్ళి – తన భవిష్యత్తుని 'బాట' వేసుకుంటున్న వాడి దగ్గరకి వెళ్ళి – 'నాతో కాసేపు కబుర్లు చెప్పరా' అని అనలేడు కదా! సరే, తర్వాత వాడికి ఊళ్ళోనే బ్యాంకులో ఉద్యోగం దొరికింది ఇక కుర్రాడికి కాస్త తీరిక దొరికిందనుకుంటే సాయంత్రాలు కూడ యింట్లో వుండడు బ్యాంకులో స్పోర్ట్సు అసోసియేషన్‌లో చేరాడు క్రికెట్ ఆడతాడు టెన్నిస్ ఆడతాడు ఆడి ఆడి అలసిపోయి వస్తాడు తన దగ్గర కూర్చుని మాట్లాడ్డానికి ఓపిక వుండదు తనకు సాహిత్యం మీద మక్కువ వాడికి ఆటల మీద ఆసక్తి తనకు చరిత్ర అంటే యిష్టం. వాడికి పాలిటిక్సు అంటే సరదా ఇంక తనతో ఏం మాట్లాడతాడు? సంభాషణ పెంచాలంటే ఇరువురికీ యిష్టమయిన టాపిక్ అంటూ ఉండాలి కదా!

పెద్ద మనమరాలు శాంతి కొంతలో కొంత తనని అర్థం చేసుకునేది కాలేజీ నుంచి రాగానే తన దగ్గర అరగంట సేపయినా కూర్చుని కబుర్లు చెప్పాక కాని తన పనుల్లోకి వెళ్ళేది కాదు రోజంతా పడిన ఒంటరితనం బాధని ఆ ఒక్క అరగంటలోను తీర్చి వేసేది ఆ పిల్ల కాలేజీ చదువయిపోయింది ఆ వేసంగుల్లోనే ఒక సంబంధం కలిసొచ్చింది తనే పూనుకొని మనుమరాలు పెళ్ళి చేయించాడు శాంతి అత్త వారింటికి వెళ్ళిపోయింది మళ్ళీ తనూ తన ఒంటరితనమూ మిగిలాయి

చిన్న మనుమరాలు పద్మ చిన్నది ఇంగ్లీషు మీడియం చదువు ఎనిడ్‌బ్లయిటన్, నేన్సీడ్రూ చదువుతుంది టి వి లో 'హమ్‌లోగ్', 'రజని' చూస్తుంది ఆ పిల్లది కొత్త తరం తనది పాత



తరం! తనొక చక్కని తెలుగు పదం వాడితే ఆ పిల్లకి ఓ పట్టాన అర్థం కాదు అదే ఇంగ్లీషులో అయితే దంచేస్తుంది తనకే పాఠాలు చెపుతుంది! తమ ఇద్దరి తత్వాలు సమానాంతర రేఖల్లా ఉంటాయి! ఇద్దర్కీ నచ్చేది ఒక్కటే! బొబ్బట్లు, పులిహోర! కోడలు పండగలకి చేస్తుంది పద్మతో కబుర్లు చెప్పటానికి అదే తన పాలిట పండగ అవుతుంది

కోడలు పెద్దగా చదువుకోలేదు. తనతో సాహిత్య చర్చ చేసే శక్తి ఆమెకు లేదు లోకాభిరామాయణం ముచ్చటించేంత తీరికా ఆమెకుండదు పాపం, ఇంటెడు చాకిరీ తానే చేసుకుంటుంది ఆఫీసరు భార్యనని భేషజాలకి పోదు జాగ్రత్తమంతురాలు అది కొంత వరకు తనకు తృప్తిగా వున్నా తనకు కావల్సింది వేరు కదా! తనకు కావల్సింది తనతో తీరిక చేసుకొని మాట్లాడే వాళ్లు ఏదో మాట వరసకు పలకరించే వాళ్ళయితే తన కిష్టం వుండదు ఎందుకు వాళ్ళిలా తన కోసం నటించటం – అని అనిపిస్తుంది వాళ్ళకి ఏ యిబ్బందీ లేకుండ తనే సంభాషణని త్రుంచేస్తాడు తను కోరుకొనేదల్లా తనతో మనసారా మాట్లాడే వాళ్ళు! తనతో సంతోషంగా మాట్లాడే వాళ్ళు

ఎదురింట్లో ఇంజినీరుగారి తండ్రి జగన్నాదం-గారితో పరిచయమయియది ఆయనదీ కలుపుగోలు గుణమే! ఇద్దరూ ఇట్టే కల్సిపోయారు. పగటి వేళ ఆ చర్చా ఈ చర్చా జరిగేది 'కొంచెం అలా చల్లగాలి పీల్చుకు వద్దాం పదండి ' అన్నాడొక సాయంత్రం వేళ జగన్నాధంగారు అక్కడ నుంచి రోజూ పార్కుకి షికారు వెళ్ళటం తమ డైరీలో ఒక భాగం అయిపోయింది

'అమ్మయ్య – తనకో తోడు దొరికింది' అని లక్ష్మీనారాయణగారు తృప్తిగా ఊపిరి పీల్చుకొని ఆరు నెలలు కాలేదు ఇంతలో ఇంజినీరు గారికి ఆ వూరి నుంచి బదిలీ అయిపోయింది కొడుకుతో పాటు జగన్నాధం గారు వెళ్ళి పోక తప్పలేదు!

ఇలాగే తన జీవితంలో ఎంతో మంది అడుగు పెట్టారు మనస్సుకి చాలా దగ్గరయ్యారు – అని అనుకొనే లోపల అర్థాంతరంగా వెళ్ళిపోయారు

దాదాజీ

తాను రిటయిరయి ఆరేళ్ళయింది ఈ వ్యవధిలో ఏ ఒక్కరితోనూ ఆ అనుబంధం సుస్థిరం కాలేదు కేవలం జ్ఞాపకాలే మిగిలిపోతున్నాయి ఒంటరితనంలో మరింత బాధాజనితా లవుతున్నాయి

జగన్నాదంగారు వెళ్ళిపోతూ రోజూ పార్కుకి వెళ్ళటం అనే అలవాటు చేసి వెళ్ళాడు ఆ పార్కులో అనేక మంది చేరుతుంటారు ఎవరి ఆటల్లో వాళ్ళుంటారు ఎవరి మాటల్లో వాళ్ళుంటారు కొందరితో పరిచయం కాకపోలేదు కొన్ని పరిచయాలు చిరునవ్వుల వరకే పరిమితం మరికొన్ని చిరు ప్రసంగాలతో టే సమాప్తం కొందరు రోజూ రారు మరికొందరు మళ్ళీ ముఖమే చూపించరు మళ్ళీ వాళ్ళు వస్తే బావుండును – అని అనిపించేటంత స్నేహం ఎవ్వరితోనూ కలగలేదు

రంజనితో పరిచయమయ్యే వరకూ ఆయనకు రోజులు నిస్తేజంగా నిర్వీర్యంగా గడిచిపోయాయి

ఆ రోజు తనకిప్పటికీ బాగా గుర్తు. 'నమస్కారమండీ!' అన్న కోమల కంఠం విని ఉలిక్కి పడ్డాడు ఆలోచనల్లోంచి తలెత్తి చూసాడు నాజూగ్గా అందంగా వుంది విస్ఫారితమయిన కళ్ళు తళుక్కు తళుక్కుమంటున్నాయి చిరునవ్వులు చిందిస్తోంది ఇరవై పైన ఒకటో రెండో వయస్సుంటుంది 'ఇక్కడ కూర్చో వచ్చాండీ!' అంది పక్కనే బెంచీ మీద కూర్చుంటూ.

తనకు నవ్వు వచ్చింది 'అనుమతి అడిగినదాన్ని మీ అనుమతి యివ్వకుండానే కూర్చున్నానని నవ్వుతున్నారా?' అని మందహాసం చేసింది 'అహ! అందుక్కాదమ్మా! పబ్లిక్ పార్కులో ఖాళీగా వున్న చోట కూర్చోటానిక్కూడ అనుమతి అడుగుతున్నావా – అని నవ్వు వచ్చింది ' అన్నాడు తను 'మీరు పెద్దవారు ముందు వచ్చి కూర్చున్నారు మీ అనుమతి అడగటం నా ధర్మం కదా!' అంది ఆ అమ్మాయి ఆమె సంస్కారానికి అబ్బుర పడ్డాడు, ఆనందపడ్డాడు.

అలా అలా మాటా మాటా కల్సింది 'నీ పేరేమిటమ్మా!' అని తను అడిగాడు 'నా పేరు వెనక పెద్ద కథ వుందండీ!' అని నవ్వింది ఏమిటో చెప్పమని కుతూహలంగా అడిగాడు

'మా వాళ్ళు పెట్టిన పేరు రజని మా స్కూల్లో ఓ క్లర్కు మహాశయుడుండే వాడు లెండి అతను పేర్లు తారుమారు చేయటంలో ఉద్దండుడు ఒకసారి తండ్రి పేరున్న చోట కొడుకు పేరు, కొడుకు పేరున్న చోట తండ్రి పేరు టైపు చేసాడు అది అలాగే బోర్డుకి వెళ్ళిపోయింది చివరకి తండ్రిగారి పేర హాల్ టిక్కట్టు వచ్చినప్పుడు కాని మా హెడ్మాస్టారు పొరపాటు గుర్తించలేదు ఇక అలాంటి చిత్రగుప్తుడు నా పేరు రజనికి బదులుగా రంజని అని టైపు చేయటంలో ఆశ్చర్యం లేదు కదా! హాల్ టిక్కట్టే కాదు – తర్వాత బోర్డు సర్టిఫికెట్టు కూడా రంజని పేరుతోటే వచ్చింది చివరికి కాలేజీలో కూడా నేను రంజనిగానే స్థిరపడి పోయాను థేంక్ గాడ్! సజని అని టైపు చేయనందుకు బ్రతికిపోయాను ' అని నవ్వింది

తన కర్థంకాక 'సజని అంటే?' అని అడిగాడు 'హిందీలో సజని అంటే ప్రియురాలు అని అర్థం కదండీ?' అని గలగలా నవ్వింది తనూ నవ్వకుండ ఉండలేకపోయాడు "మీ చిత్రగుప్తుడు పొర పాటు చేస్తే చేసాడు. నీకు చక్కని పేరు పెట్టాడు అందరి మనస్సులనీ రంజింప చేసేలా మాట్లాడ గలవు అందుకనే ఆ పేరు పెట్టాడు "అన్నాడు తను ఆమె బిడియంగా నవ్వింది నిజంగా సిగ్గే సింగారం – అన్నది ఆమెలాంటి పిల్లను చూసాకనే అన్నారేమో – అని తన కనిపించింది

ఆమె గురించి వివరాలడిగాడు చెప్పింది బియ్యే చదివింది హిందీలో విశారద పాసయింది ఈ వూళ్ళో వాళ్ళ బాబాయి గారున్నారు బాబాయి గారికి పిల్లలు లేరు తనంటే వాళ్ళకి వల్లమాలిన అభిమానం. ఇక్కడ హిందీ టీచరు పోస్టు ఖాళీగా వుందంటే ఆమెకు కబురు పంపి రప్పించాడాయన ఇటీవలే వచ్చి స్కూల్లో చేరింది స్కూలు నుంచి వచ్చాక పిన తల్లితో కాసేపు కబుర్లు చెపుతుంది ఇంట్లో సాయం చేస్తుంది చిన్న సంసారం పెద్దగా పనులేవీ ఉండవు బాబాయి ఎప్పుడో పొద్దు పోయి గాని రాడు ఇంట్లో తోచక ఆ వేళ అలా పార్కు వైపు వచ్చింది

ఒంటరిగా కూర్చున్న తను కనిపించాడు ఎందుకో తననే పలకరించాలనిపించిందట! తనకి పరమానందమయింది. ' . ఈ ఒంటరి వాడి మీద దయ కలిగి ఆ దేవుడే నిన్ను నా దగ్గరకి పంపించాడమ్మా!' అన్నాడు మనస్ఫూర్తిగా. తన గొంతులోని దగ్గుత్తికకు రంజని చకితురాలైంది 'అదేమిటండీ! మీరు ఒంటరివారా? మీ కెవరూ . ' ఆమె మాటల కడ్డు వచ్చి అందరూ వుండి తను ఒంటరి వాడెలా అయ్యాడో చెప్పాడు ' ఎంత అయిన వాళ్ళయినా ఇలాంటి సున్నితమయిన విషయాలు పైకి చెప్పుకోలేం కదమ్మా!' అన్నాడు



కొన్ని నిమిషాల క్రితం ఏర్పడిన అనుబంధం తన మనస్సులోని వేదననంతా వెళ్ళగక్కుకునే స్వతంత్రాన్ని తెచ్చింది ఆ అమ్మాయితో తన గురించి చెప్పుకోకుండ ఉండలేక పోయాడు

'సారీ' నా సొదతో నిన్ను బోరు కొట్టినట్టున్నాను ' అని తానంటే 'అయ్యో' అంత మాటనకండీ' మీ గురించి తెల్సుకోవటం నాకు సంతోషంగా వుంది మీరు రోజూ యిక్కడికి వస్తారు కదా' నాకూ సాయంత్రాలు తోచటం లేదు. ఇక నుంచి రోజూ నేనూ వస్తాను ' అంది ఆమె 'అంత కంటేనా తల్లీ!' అన్నాడు ఆమె అప్యాయతకు కళ్ళు చెమ్మగిల్లగా

మర్నాడు 'దాదాజీ' మై అగ యీ' అంటూ వచ్చింది తను తెల్లబోతూ చూసేసరికి 'సో సారీ' పిల్లలకి హిందీ పాఠం చెప్పి చెప్పి వచ్చాను కదాండీ! తాతయ్యగారూ అనబోయి దాదాజీ అనేసాను ' అని నవ్వింది 'అభిమానానికి స్వరమే కాని భాషతో నిమిత్తం లేదు తల్లీ! నువ్వెలా పిలిచినా నా కిష్టమే!' అన్నాడు తను 'అయితే, సరదాగా మిమ్మల్ని దాదాజీ అనే పిలుస్తాను ' అంది. అబ్బ, ఎన్ని కబుర్లు చెపుతుందో! ' మరి వెళ్ళొస్తాను దాదాజీ!' అని ఆమె లేచే వరకూ బాగా చీకటి పడిందని తనకు స్పృహ రాదు ఆమె సమక్షంలో గంటలు క్షణాల్లా గడిచిపోతాయి

ఓ రోజున ఏదో పత్రిక చేత బుచ్చుకుని వచ్చింది. 'దాదాజీ' నేను హిందీ లోంచి తెలుగులోకి అనువాదం చేసిన కథ ఈ పత్రికలో పడింది మీకు చూపిద్దామని తెచ్చాను ' అంది తాను ఆశ్చర్యపోయాడు 'నువ్వు కథలు రాస్తావామ్మా' ఎప్పుడూ చెప్పావు కాదేం?' అంటూ ఆ పత్రిక నందుకున్నాడు

'స్వంత రచనలు కాదు కదాండీ' ఇందులో చెప్పుకునేంత ప్రత్యేకత ఏముందని?' అని బిడియంగా నవ్వింది ఆ కథ చదివాడు తను హృదయానికి హత్తుకునేలా వుంది రచన అనువాదకురాలి ప్రజ్ఞ వల్ల ఆ రచనకి ఆ గొప్పతనం వచ్చిందేమో అన్నంతగా బావుంది 'నిజంగా ఆణిముత్యం లాంటి కథ' నీ ఎన్నిక బావుంది నీ అనువాదమూ బావుంది రెండు భాషలకీ మధ్య వారధి లాంటి దానివి నువ్వు!' అన్నాడు తను అభినందిస్తూ

'ఇంత చిన్నదానికి నన్ను ఆకాశాని కెత్తేస్తున్నారు నేనింకా చిన్న దాన్ని ప్రారంభంలోనే ఉన్నాను దాదాజీ!' అంది రంజని 'లేదమ్మా' ముఖస్తుతికి నేనా మాట అనటం లేదు నీ అనువాదం నిజంగా చాలా బావుంది హిందీ నుంచి తెలుగులోకి చేసావు బాగానే వుంది మరి మన బాషలో కూడ మంచి మంచి కథలున్నాయి కదా' వాటిని హిందీలోకి అనువాదం చేయకూడదూ!' అన్నాడు

రెండు రోజులు పోయాక 'దాదాజీ' మొత్తానికి మీరు నా బుర్ర తిరిగి పోయేలా చేసారు ' అంది రంజని అప్పటికే ఆమె గమ్మత్తు కబుర్లకి

తేడా!

గతం-
చరిత్ర
పుటల్లో
జీవిస్తే
భవిష్యత్తు-
కవి
కవితల్లో
జ్వలిస్తుంది!!

—చల్లా విశ్వనాథం

దాదాజీ

అలవాటయిన తనకి ఆమె అలాగనటం ఆశ్చర్యమనిపించలేదు మృదు పరిహాసమనిపించింది 'ఏమిటమ్మా' ఏ సంగతీ?' అని అడిగాడు 'అఖరి కెలాగయితేనేం మీ కోరిక నెరవేరింది . 'వెలుగు' అనే తెలుగు కథని హిందీలోకి అనువాదం చేసాను ' అంటూ అచ్చులోని తెలుగు కథని - హిందీ అనువాద ప్రతిని చూపించింది తెలుగు కథని తను చదివాడు

కాపీ చేస్తుంటే పట్టుకున్న లెక్చరర్ మీద దౌర్జన్యం చేయటానికి చాకు పుచ్చుకుని ఇద్దరు కాలేజీ కుర్రాళ్ళు వాళ్ళింటికి వెడతారు లెక్చరర్ ఇంట్లో వుండడు కాని, వాళ్ళెందుకు వచ్చారో గ్రహిస్తుంది ఆయన భార్య ఏ మాత్రం తొణుక్కుండా ఆ కుర్రాళ్ళతో సాదరంగా మాట్లాడి వాళ్ళలోని ఆలోచనల దారి మార్చి - వాళ్ళలో పరివర్తన కలిగిస్తుంది చివరకి వాళ్ళ జీవితాలకు వెలుగు చూపించటం ఆ కథలోని ఇతివృత్తం

'కాపీ చేసే పిల్లలు అన్ని ప్రాంతాలలోనూ ఉన్నారు ఇన్విజిలేటర్ను మీద దౌర్జన్యం చేయడం దేశమంతటా సర్వసాధారణమయిపోయింది అన్ని ప్రాంతాలకీ సరిపోయే చక్కని కథని ఎన్నుకున్నావు హిందీ పాఠకులకి నీ కథ తప్పకుండా నచ్చుతుంది ' అన్నాడు తను.

'అచ్చు కావాలి కదండీ' అప్పటి మాట కదా' అంది రంజని ' అచ్చవనీ అచ్చు కాకపోనీ నీ ప్రయత్నం మానకూడదు తెలుగు కథల్ని నీలాంటి వాళ్ళే వెలుగులోకి తీసుకురాగలిగేది నా దగ్గర మంచి లైబ్రరీ వుంది పుస్తకాలు నేను తెచ్చిస్తాను బాగా చదువు భాష మీద మంచి అథార్టీ వస్తుంది ' అని తను ప్రోత్సహించారు 'దాదాజీ' మీతో మాట్లాడ్డమే నాకొక ఎడ్యుకేషన్ ' అని కమ్మగా నవ్వింది రంజని

తను పుస్తకాలు తెస్తుంటాడు ఆమె చదువుతుంది వాటి మీద తమ మధ్య చర్చలు జరుగుతుంటాయి. ఆమెతో చర్చించటం కోసమయినా తను పని కట్టుకొని పుస్తకాలు చదువుతుంటాడు పగటి పూట వుండే ఒంటరితనం మటుమాయమయిపోయింది!

ఓ రోజున రంజని తన కంటె ముందే పార్కుకి వచ్చి కూర్చుంది తనని చూస్తూనే చిన్న పిల్లలా పరిగెత్తుకు వచ్చి 'దాదాజీ' యు ఆర్ గ్రేట్!' అంది ఆమె చేతిలోని కవరు చూస్తూ 'ఏమిటమ్మా' అంత ఘన కార్యం నేనేం చేసాను?' అని నవ్వాడు తను.

'సరిత – అనే హిందీ మేగజైన్‌లో నా కథను అచ్చు వేయబోతున్నారు ఏక్సెప్ట్ చేసినట్టు ఇవాళే ఉత్తరం వచ్చింది మీరు ఎంకరేజ్ చేసి వుండకపోతే నేను తెలుగు కథని హిందీలోకి అనువాదం చేసేదాన్ని కాదు 'దిస్ క్రెడిట్ మస్ట్ గో టూ యూ!' అంటూ ఆ కవరు తన కందించింది రంజని

ఆనంద పారవశ్యంతో తనకు కళ్ళనీళ్ళు వచ్చాయి 'నిన్ను పొగిడితే ఆయుష్ హీనం అవుతుందని కాని నువ్వు ప్రతిభావంతురాలివని నేనెప్పుడో గ్రహించానమ్మా' నీకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంది' ' అన్నాడు తను ఆమె తల మీద చేయి వేసి అప్యాయంగా నిమురుతూ

'అంతా మీ ఆశీర్వాదం దాదాజీ! మీతో పరిచయం నా జీవితంలో ఇంత చక్కని మలుపు త్రిప్పుతుందని నేనెప్పుడూ ఊహించలేదు.' అంది రంజని 'ఉహుం' ఎల్లకాలం ట్రాన్స్‌లేటర్‌గా ఉండిపోతాననుకుంటున్నావా? నీలో ఒరిజినాలిటీ ఉంది ఏనాడో భావావేశం పొంగి వస్తుంది భాష నీకందుబాటులో వుంది. స్వంతగా కథలు రాయాలనిపిస్తుంది రాస్తావు రాయకుండ ఉండలేవు అటు హిందీలోను . . ఇటు తెలుగులోను కూడా' అన్నాడు తను.'అమ్మో!' దాదాజీ నన్ను హడల కొట్టేస్తున్నారు ' అంది రంజని.

'హడలి పోతావో' కదలిపోతావో' నాకు తెలియదు నీ కలం మాత్రం కదలిపోవాలి కథలతో ఆగిపోదామనుకుంటున్నావా' ఉహుం' ఇంతింత నవలలు రాయాలి దాదాజీ – ఇదిగో ఈ నవల మీ కంకితం ఇస్తున్నాను – అని నువ్వు అనాలి. అప్పటి దాకా నా బాకీ తీర్చాపు కాదేమిటమ్మా – అని నిన్ను నేను వేదిస్తూనే ఉంటాను' అన్నాడు తాను

ఆ అమ్మాయి ముఖం సిగ్గుతో ఎర్రనయింది మాట్లాడలేక మురిపెంగా నవ్వి వూరుకుంది ఆ సంఘటన జరిగి నెల రోజులయింది ఈలోగా రెండు హిందీ కథల్ని తెలుగులోకి అనువాదం చేసి పత్రికలకు పంపింది రంజని గత వాల్గు రోజులుగా మరో చక్కని తెలుగు కథని హిందీలోకి తర్జుమా చేసే పనిలో పడింది నిన్నటి రోజునే అది పూర్తి చేసింది ఫెయిర్ కాపీ చేసి ఇవేళ పోస్టు చేస్తానని చెప్పింది

ఇంక రంజని వచ్చే వేళయింది . . అనుకుంటూ గేటు వైపు మళ్ళీ దృష్టి సారించాడు లక్ష్మీనారాయణ గారు

అల్లంత దూరంలో రంజని కనిపించేసరికి ఆయన మనస్సు పరవశించింది ఉత్సాహంగా పైకి లేచి బెంచీ మీద లేని దుమ్ముని దులిపి మళ్ళీ కూర్చున్నాడు

నువ్వు నాలుగు వందల ఏభై సెకన్లు ఆలస్యంగా

వచ్చావమ్మా!" అన్నాడు దగ్గరగా వచ్చిన రంజని ముఖంలోకి చూసి నవ్వుతూ.

రంజని ఏదో గమ్మత్తయిన మాట అంటుంది అనుకుంటూ ఎదురు చూసాడు ఆయన. కాని, ఆమె ఏమీ అనలేదు. పల్చగా నవ్వి వూరుకుంది. ఆ నవ్వులో ఎందుకో ఎప్పటి కాంతి లేదు. స్కూల్లో పిల్లలకి పాఠాలు చెప్పి చెప్పి పాపం అలసిపోయిందేమో! 'అలా నిలబడి పోయావేమిటమ్మా! కూర్చో!" అన్నాడు.

రంజని కూర్చుంది. అటూ ఇటూ తల తిప్పి చూసింది. కొన్ని క్షణాల పాటు పార్కులో అందర్నీ కలయజూస్తూ కూర్చొంది.

వస్తూనే గలగల సెలయేరులా ప్రవహించే ఆమె ఒక్కసారిగా మౌనవ్రతం పట్టటమేమిటి? అతనికి చిత్రమనిపించింది ఏదో అసాధారణమనిపించింది ఎలా ప్రస్తావన ఎత్తాలో మొదట తోచలేదు. ఏదో గుర్తొచ్చి "కథ పోస్టు చేసేసావా?" అని అడిగాడు.

తల వూపింది కాని పెదవి విప్పలేదు.

'ఏమిటాలోచిస్తున్నావు?"

'అబ్బే, ఏమీ లేదండీ!"

"ఉహుఁ! నాకు తెల్సు ఒక పదిహేను అనువాద కథలయిపోయాయి. మరి దాదాజీ బాకీ తీర్చటానికి ఏ తెలుగు కథ రాయాలా అని ఆలోచిస్తున్నావు కదూ!... ఎవరి కథో ఎవరి కథో ఎందుకు? మీ దాదాజీ కథే వ్రాసెసెయ్!" అని గలగల నవ్వాడు లక్ష్మీనారాయణగారు.

"నేనెప్పటికీ మీ బాకీ తీర్చలేను దాదాజీ!"

అలవాటుగా రంజని పరిహాసాని కామాట అందేమోనని ఆమె వైపు చూసి నవ్వబోయాడు ఆయన. వాడిపోయిన ఆమె ముఖం చూసేసరికి ఆయన కేదో అంతు పట్టని భయంతో గుండె జల్లుమంది. "ఎందుకమ్మా అంత మాట అంటున్నావు?"

"ఓ సంగతి మీతో చెప్పాలని చాలా రోజులుగా అనుకున్నానే కాని చెప్పనే లేకపోయాను దాదాజీ!"

'ఏమిటమ్మా? ఏ సంగతి?" అని అడిగాడు అయోమయంగా చూస్తూ.

'నేనీ వూర్నుంచి వెళ్ళిపోతున్నానండీ!"

ఆయన గతుక్కుమన్నాడు. " ఈ వూర్నుంచి వెళ్ళిపోతున్నావా? ఎందుకమ్మా? ఎందుకని?" అని కంగారుగా అడిగాడు.

'నన్ను క్షమిస్తానంటే...."

"క్షమించవల్సినంత అపరాధం నువ్వేం చేసావమ్మా!" అన్నాడు పిచ్చివాడిలా చూస్తూ

హేండ్‌బేగ్ తెరచి అందులోంచి ఓ కవరు బయటకు తీసి లక్ష్మీనారాయణ గారి చేతుల కందించింది ఆమె. అందుకుంటుంటే ఆయన చేతులెందుకో కంపించాయి. ఆ కవరు మీద 'దాదాజీ' అని వ్రాసి వుంది..

"ఏమిటమ్మా యిది?" అని అడిగాడు తెల్లబోతూ.

"తెరిచి చూడండి."

తెరచి చూసాడు.... పెళ్ళి శుభలేఖ! వరుడు ప్రభాకర్! వధువు రజని!

ఇ·వేమన·పద్యాలు

పాము కంటె గలదె పాపిష్టి జంతువు
యట్టిపాము చెప్పినట్టు వినును
ఖలుని గుణము మాన్ప ఘనులెవ్వరును లేరు
విశ్వదాభిరామ వినురవేమ

"ర.....జ.....ని" నీ పెళ్ళి శుభలేఖా!"

"అవునండి. ప్రభాకర్ మా బావ. అతనికి కలకత్తాలో ఉద్యోగం...." ఆపైకి రంజని మాటలు లక్ష్మీనారాయణ గారికి వినిపించలేదు ఆయనకు స్పృహ తప్పినంత పనయింది.

"రేపటి నుంచి రజని ఇక్కడికి రాదు. ఈ వూర్నుంచి వెళ్ళిపోతోంది..." ఆ నిజం ఆయన నవనాడుల్ని క్రుంగదీస్తోంది గాఢంగా ఏర్పడే అనుబంధాలన్నీ, ఒక్కటొక్కటే యిలా అర్థాంతరంగా తెగిపోవటానికేనా - అని గుండె కలుక్కుమంటోంది.

"నన్ను క్షమించండి దాదాజీ!..."

రంజని గద్గద స్వరం ఆయన మనస్సుని కదలించింది. "అయ్యో! ఎంత మాట తల్లీ! పెళ్ళి శుభలేఖ ఇచ్చావు. కంగ్రాట్యులేషన్స్ వెంటనే చెప్పాలని తోచని మూర్ఖుడ్ని. నువ్వే నన్ను క్షమించాలి "

.. .

రంజని వెనక్కి తిరిగి వెళ్ళిపోతుంటే 'దాదాజీ' గుండె చెరువయింది. మళ్ళీ తన మనస్సుని రంజింప జేసే రంజని కనిపించదు.. అన్న నిజం ఆయన్ని నిలువునా కాల్చేస్తోంది

పార్కులోని జనమంతా ఎప్పుడో వెళ్ళిపోయారు. లక్ష్మీనారాయణగారొక్కడూ అక్కడ ఒంటరిగా మిగిలిపోయారు.

అక్కడంతా శూన్యం. చీకటి. 'దాదాజీ' మనసు నిండా శూన్యం. చీకటి' □